# ఏ పూట గోపాళం ఆ పూట గోవిందా!

'మూడు నాళ్ళాయరా మువ్వగోపాలా!'

ఒంటిమీది నుంచి నీరు జారుతున్న సవ్వడి మెల్లిగా వినిపిస్తూ ఉంటే అది తాళంగా మృదుమధురమైన మంజులగానం తోడుగా వినిపిస్తోంది. మధ్యనలుగుపిండి రుద్దుకుంటున్నప్పుడు లయబద్ధంగా వినిపిస్తోన్న బంగారు గాజుల సవ్వడి.

లోపల స్నానం చేస్తోంది మంజువాణి. మహారాజా వారికి వెలి అంతఃపురంలో మహారాణీ వారి స్థానం ఆమెది. నగరు విడిచి రాజువారు అడుగువేస్తే అడుగిడేది మంజువాణి ముంగిటిలోనే - మరొకరి మక్కువ కోరకుండా, మరో దారి వెతుక్కోకుండా మహారాజా వారినే నమ్ముకుని జీవిస్తోంది మంజువాణి.

'వాణీ ! వాణీ!'

గది బయట నుంచుని 'దీని స్నానం ఎప్పుడవుతుందో!' అని విసుక్కున్న మృదుల ఇహ ఆగలేక పిలిచింది.

ఆలోచిస్తూ-స్నానాన్ని ఆనందిస్తూ-లోగొంతుకలో క్షేత్రయ్యని ఆలపిస్తున్న మంజువాణికి మృదుల పిలుపుకంతుని కేకలా వినిపించింది.

'మృదు వచ్చిందా?' అనుకుంది మంజువాణి.

కోకిల కేకలు వసంతాగమనం తరువాతే-మయూరి పురి విప్పేది' మొయిలు రాక తరువాతే అలాగే మంజువాణి ఇంటికి మృదుల వచ్చిందీ అంటే....

అంటే.....

మహారాజా వారు వస్తున్నారన్న మాట.....

చప్పున స్నానం ముగించి తడిసిన ఒంటి ఒంపు సొంపుల్ని తడి ఆర్చుకుంటూ చీర సుతారంగా చుట్టుకుని స్నానాల గది తలుపులు తీసి బయటికి వచ్చింది మంజువాణి.

గదిలోంచి బయటికి వచ్చిన ఆమె-

హేమంత సుందరిలా ఉంది.

తడిసిన గులాబీలా ఉంది.

విరిసిన మందారంలా ఉంది.

మంచుబొమ్మలా మించురెమ్మలా ఉంది.

'చూసేందుకు రెండు కళ్ళూ చాలవే!' అంది మృదుల.

"చాల్లేవే మృదూ.... బయటే నుంచుండిపోకపోతే తలుపు తోసుకుని రారాదూ....'

'రారాజులకు మాత్రమే దర్శనీయమైన అందాలు మా బోంట్ల కళ్ళబడితే....'

'దృష్టి సోకుతుందా?'

'ఊహూఁ మాకే మతిపోతుంది.'

'చాల్లేవే.' నవ్వేసింది మంజువాణి.

'వాణీ.... రాత్రికి రాజావారొస్తున్నారు."

'ప్రత్యేకించి పనిగట్టుకుని మువ్వొచ్చావూ అంటే రాజుగారి రాకకు రథానికి ముందు రక్షకుడొచ్చినట్టే కదా ! రమ్మనవే. నా సముఖానికి రాయబారమెందుకే. చెరుగు మాసి వారమైంది. నీళ్ళోసుకుని మూడునాళ్ళైందని చెప్పవే'.

'నీళ్ళోసుకున్నావా?' ఫక్కున నవ్వింది మృదుల. సురపారిజాతాలు జలజల రాలినట్లైంది.

'ఒట్టి నీళ్ళనే ఒయ్యారీ - చెరుగు మాసిందన్న మాటే నీ చెవి సోకలేదటే - నీళ్ళోసుకునే అదృష్టమే పడితే - మా రాజంటి మగనలుసు ఈ ఇంట వెలిస్తే.....' అర్థోక్తిలోనే ఆగింది.

'ఏం చిత్రమేఁ మంజూ? మనింటా వంటాలేని మాటంటున్నావేఁ.'

'ఏమిటేఁ' కనుబొమలు ముడివేసింది మంజువాణి.

'మనకెందుకే మగనలుసు-కంట్లో నలుసే ఓర్చుకోలేం - ఇంట్లో మగనలుసును ఓర్చగలమటే - మన క్కావలసింది. మనసైంది మన్మథమొలక - అపరంజ గిలక - గారాల రాచిలక. తెలిసిందా-'

'నాకు తెలిసింది నీకే తెలీలేదు' నిట్టూర్చింది మంజువాణి.

'వాణీ ఏమిటే.ఆ రెప్పలు బరువుగా వాలిపోయాయి. అధరాలు అదురుతున్నాయి?'

"ఆడపుట్టుక పుట్టాను. అర్థాంతరంగా - నా ప్రతిబింబాన్ని ఇవ్వకుండానే అడవిలో పలాశంలా రాలిపోతానేమోనని భయం" తన మనసులోని మాట బయటికి చెప్పలేదు మంజువాణి. మృదుల కూడా రెట్టించలేదు.

'రావే రాగాల సరాగాల రమణీ! రాజావారు సంబరాన పంపిన సంభారాలు అందుకుని - తాంబూలం స్వీకరించి పంపు'

'కొత్తగా అంటున్నావేమిటే మృదులా ! యౌవనాన్ని ఆయనకే అంకితం చేశాను. తాళి కట్టిన అర్థాంగిని కాకపోయినా తను విప్పి తనలో నేను సగమైనదాన్ని. తాంబూలం పుచ్చుకోవటం'-

'అది ఆచారమే అలివేణీ'-

నడిచింది మృదుల. ఆమె వెనకే మంజువాణి. నాలుగు అడుగులు నడిచి గది ముందుకి రాగానే అందులో ప్రవేశించింది.

అక్కడ -

అంతర మెరిగిన-ఆంతర్య మెరిగిన చెలి-నెచ్చెలి-జాబిల్లి ఉంది. ఆమె పేరుకే కాదు మాటకీ; మనసుకీ జాబిల్లే!

'రాక రాక రాజావారొస్తున్నారా - అప్పుడో-ఇప్పుడో అని ఆత్రపడుతున్నారు. నీ అందాలు నీ చందాలు విందు సేయవే విరిబోణీ' అంది జాబిల్లి. మంజువాణి తలకు సంపెంగ నూనె రాస్తూ. ఉదయం వెన్నపూస రాసి తలంటిపోసిన మంజువాణి కురులు సవరించని వీణతీగల్లా మన్మథరాగాలు పలికాయి. తలకట్టు దువ్వి జడకట్టు వేసింది. ముఖాన సిందూరతిలకం. ఆ పై అర అరగా అలంకరించి మల్లెపూవులాటి తెల్లచీర కట్టించింది. ముఖమల్ రవిక తొడిగించింది. అలంకారం ముగిసింది. ఆపై వాడకట్టుకే మేల్తరమైన నగకట్టు వేసింది.

లోపలి గాగరా అందాలు విందు సేయగా అడుగు బయటపెట్టింది మంజువాణి.

పసారా ఈవలి గదిలో మృదుల.

మంజువాణిని చూడగానే 'ఇదిగో విరులదొంతి. ఇది నేటి రాత్రికి నువ్వు సింగారించాల్సిన కాశ్మీరం. ఇది చీనీచీనాంబరం. ఇవి ఫలాలు - నోము - నీ ఫలాలు ఇవి తీపులు - తరితీపుల మెరుపులు. ఇవి జాజులు - విరిసే నీ యౌవనానికి సిరిజాజులు. ఇవి సడిసేయని గాజులు - పూసలు ఇంకా....ఇంకా.... ఇవి పరహాలు. విరహాల విలువలు. ఇవి నగలు....నగల సెగలో మూసబోసిన మేలి విన్నాణాలు' మృదుల అంది ఒక్కొక్కటీ చూపుతూ చేతికి అందిస్తూ.

అన్నిటినీ అలా అలవోకగా చూసింది మంజువాణి.

'ఇవా నాకు వలసినవి ? కావలసినవాడే రావాలి గానీ' అనుకుంది.

చేయి చాచింది మృదుల.

తనలోని భావాలని అంతరంగాన్ని అతలాకుతలం చేసే ఆలోచనల్ని అలా తర్రిమేసి తాంబూలం ఇచ్చింది మంజువాణి.

✧ ✧ ✧

మృదుల వెళ్ళిన నాలుగు గడియలకు వచ్చారు రాజావారు. అప్పటికే ఎప్పటిలా కాకుండా మన్మథ వేదానికి టెప్పణిలా అలంకరించింది జాబిల్లి.

రాజావారు రాగానే - ఎదురేగింది మంజువాణి.

పన్నీటితో కాళ్ళు కడిగి - పై టకొంగుతో తడి అద్దింది. ఆ సమయంలో రాజావారి కఠినమైన పాదాలు మరీ కఠినమైన మంజువాణి యౌవనమండలాన్ని సోకాయి. రాజావారు రసిస్తే మంజు పరవశించింది.

ఆపై -

ఆమె రాజావారి కౌగిల్లో రాజవారు ఆ లోగిల్లో బందీలయ్యారు. సయ్యారాలు సయ్యాటలాడేయి.

✧ ✧ ✧

"'ఏడాది కోసారి వస్తుంది వసంతం'

"మేం వచ్చి వెళ్ళి ఏడాదైందా?"

"'ఏడాది అయితే మీకు ఈ దాసి కనిపించేది కాదు అవశేషాలే ఉండేవి. నెల దాటిపోయింది."

"నెల దాటిపోయిందా?" రాజావారు కొంటెగా అన్నారు.

'తమ దాసికి అంత భాగ్యమా? భోగ్యవస్తువునే కానీ... అంతకు మించిన అదృష్టం...."

"ఇదేం చిత్రం... అక్కడ మళ్ళీ మాతృత్వం వద్దంటారు వారు. ఇక్కడ తల్లిని కాలేదని తపన. లోకరీతి మారిందా?"

'అక్కడ అది సబబే. యువరాజా వారికి దాయాది బాధ ఉండరాదు కదా... మరి..'

'ఇక్కడ....'

'మిమ్మల్ని నోరారా పిలవలేను. మీ కో మొలకను కంటే పేరెట్టి పిలుచుకోవచ్చు. క్షణ క్షణం తలుచుకోవచ్చు.'

'రాసకేళిని రట్టు చేసి రచ్చబండపై వేసి-

లేత తమలపాకులాటి చేతితో రాజావారి పెదాలు మూసింది. ఆయన గరుకుమీసం ఆమె సున్నితమైన వేళ్ళను గుచ్చింది.

"గుండెల్లో గుడి కట్టిన దేవరను...బజార్న పెడతానా? బయటికి కన్నవాడిని కన్నా అని పిలిచినా...మనసులో కృష్ణా అనే పలుక్కుంటాను" ఎదలోని సొద వినిపించుకుంది, విన్నవించుకుంది.

ఆ పేరు బహిరంగంగా ఉచ్చరించినందుకు సిగ్గుల మొగ్గై ఆయన ఎదమీద కలువలా వాలిపోయింది.

రాజావారు మరోసారి కౌగిలిలో బంధించారు.

✧ ✧ ✧

"ఏమిటే ఇది ?"

మరురోజు ఉదయం - స్నానం చేసి పట్టుబట్ట కట్టుకుని పురోహితులవారి సోమిదెమ్మను రమ్మని గత రాత్రి రాజావారు పంపిన సమస్తమూ ధారపోస్తొంటే-చూసి-ఆగలేక అడిగింది జాబిల్లి.

'జాబిల్లీ-ఏపూట గోపాళం ఆ పూటే గోవిందా అన్నారు. మిగుల్చుకున్నా మిగుల్చుకోవాలని ఆశపడినా మళ్ళీ పూటకు గోవిందే అవుతుందట- ఆ జన్మ నుంచి ఈ జన్మకి ఈ జన్మ నుంచి రేపటి జన్మకి దిగుమతి అయ్యేవి ఇచ్చిపుచ్చుకున్న పుణ్యపాపాలే! ఇవేవీ కావు.'

'వచ్చింది వచ్చినట్టు ఇచ్చేస్తే... సంభారాలు సరే-నగలూ....నాణేలూ..."

'వద్దు-నాకు అమ్మ ఇచ్చిన తోట ఉంది. ఆమె దాచిపెట్టిన ధనం ఉంది. తొలిరేయి రాజావారు పెట్టిన నగకట్టుంది. కట్టిచ్చిన ఈ భవంతి ఉంది. ఏ పూటకి ఆ పూట కడుపు నింపేలా పాలిచ్చే కామధేనువు ఉంది. ఇంకేం కావాలే!"

'నువ్వు...నీ తరువాత...'

'నా కొడుక్కి చదువు చెబుతాను. శాస్త్రం నేర్పుతాను. వైణిక సార్వభౌముడిని చేస్తాను. ఇన్నేళ్ళ మన జీవన స్రవంతిలో పలికిన అపస్వరాల అపఖ్యాతి పోయేలా అతనితో సంగీతామృతం పలికిస్తాను. అతడ్ని-అతడి ఇంటి ఇల్లాలిని-పిల్లలను-చూస్తూ మన దివాణం కథలూ గాథలూ మననం చేసుకుంటూ కృష్ణా అనుకుంటూ కాలం గడిపేస్తాను.' తృప్తిగా అంది మంజువాణి.

'నువ్వో శాపగ్రస్తవి.' నిందిస్తోందా 'అన్నట్టు అంది జాబిల్లి.

'అందుకే-శాపవిమోచనానికే-ఈ శ్రమంతా' నింపాదిగా అంది మంజువాణి-నిట్టూర్చింది. జాబిల్లి-వ్యాఖ్యానం అవసరంలేని కావ్యంలా శోభిల్లింది మంజువాణి.

● 28-10-87 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ●